# వివిధ దేశాల్లో కార్మిక ప్రజా ఆందోళనలు

*(ఎడతెగకుండా సాగుతున్న ఉక్రెయిన్ – రష్యా యుద్ధం, పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతిహనన భీకర దాడులు, వివిధ ప్రపంచ దేశాల నడుమ కల్లోల పరిస్థితులు, అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ దేశాలపై విధిస్తున్న ప్రతీకార సుంకాలు.... వీటన్నింటికీ మూలకారణమైన పెట్టుబడిదారీ సంక్షోభం, సూపర్ లాభాపేక్ష, కార్మికుల శ్రమదోపిడిని తీవ్రం చేసే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలతో ప్రపంచ వ్యాపిత ప్రజానీకం, ప్రత్యేకించి కార్మిక కష్టజీవులు, శ్రామిక ప్రజానీకపు జీవితాలు మున్నెన్నటికంటే దుర్భరమౌతున్నాయి. తమపై సాగుతున్న శ్రమదోపిడి, వేతనాలతో కోత, పనిభారాలను నిరసిస్తూ కార్మికులు, ఉద్యోగులు వివిధ రూపాల్లో తమ అసంతృప్తి, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రపంచ దేశాల్లో **2025 మార్చి, ఏప్రిల్ నెలలలో** జరిగిన కొన్ని ఆందోళనలు గమనిస్తే, తమ డిమాండ్ల పరిష్కారానికి వేల సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు వివిధ సెక్షన్ల ప్రజానీకం.... ప్రభుత్వ, పాలకుల నిర్బంధాన్ని సైతం ధిక్కరించి వీధుల్లోకి రావడాన్ని గమనించగలం. ఈ ఆందోళనలు దీర్ఘకాలం పాటు, డిమాండ్ల పరిష్కారం దాకా సాగగలగాలి. రాజకీయ డిమాండ్లపై ఉద్యమాలు నిర్మించాలి. అంతేగాక వ్యవస్థ మార్పుతో ముడిపడి, సామ్యవాద సమాజం సాకారం అవుతుందనే స్పృహను, చైతన్యాన్ని, కార్మిక వర్గం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవాలనే అవగాహనను సారాంశంలో మార్క్సిస్టు తాత్విక భావజాలాన్ని, కార్మిక – శ్రామిక – పీడిత ప్రజానీకానికి అందించి, వారిని రాజకీయంగా సాయుధం చేయటంలో చైతన్యయుతులైన ట్రేడ్ యూనియన్ నాయకత్వాలు, కమ్యూనిస్టు విప్లవ శ్రేణులు పూనిక వహించి కృషి చేయాలి. **– సంపాదకులు)***

### నేపాల్ : పనిపరిస్థితుల మెరుగుదల కోసం ఉపాధ్యాయుల ఆందోళన

ఉపాధ్యాయ అనుకూల స్కూల్ ఎడ్యుకేషన్ చట్టాన్ని చేసి అమలు చేయాలనే డిమాండ్‌తో నేపాల్‌లోని ఉపాధ్యాయులు నేపాల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎన్‌టిఎఫ్) ఆధ్వర్యంలో **ఏప్రిల్ 7వ తేది** నుండి నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీనికి ముందుగా వేలాదిమంది ఉపాధ్యాయులు ఖాట్మాండులో ఏప్రిల్ 2న నయా బనేశ్వర్ నగరంలో ప్రదర్శనలు, ధర్నాలు, నిర్వహించారు.

తమ నిరవధిక సమ్మెలో భాగంగా ఉపాధ్యాయులు ఏ విధమైన అధికారిక విధులు–పరీక్షా పత్రాల మూల్యాంకనం, ఫలితాల వెల్లడి, పాఠశాలల్లో ప్రవేశాలు, శిక్షణా తరగతులు–మొదలైనవన్నీ బహిష్కరించి సమ్మె కొనసాగించారు.

### పాకిస్థాన్: ప్రైవేటీకరణను నిరసిస్తూ హెల్త్ వర్కర్ల ఆందోళన

పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో వివిధ హెల్త్ యూనియన్‌ల ఆధ్వర్యంలో వందలాదిమంది కార్మికులు **ఏప్రిల్ 10 నుండి** ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాపిత నిరసనాందోళనలు నిర్వహిస్తున్నారు. మార్చిలో ప్రకటించిన ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా బేసిక్ హెల్త్ యూనిట్లను, రూరల్ హెల్త్ సెంటర్స్ కార్యకలాపాలను ప్రైవేట్ యాజమాన్యాలకు అప్పగించటాన్ని వారు వ్యతిరేకించారు.

### బంగ్లాదేశ్ : ప్రతీకార సుంకాలతో పెరిగిన భారాలకు కార్మికుల నిరసన

నారాయణ్ గంజ్‌లోని ఏఎస్‌టి గార్మెంట్స్ ఫ్యాక్టరీ కార్మికులు 200 మంది ఢాకా–ఛత్తోగ్రామ్ ప్రధాన రహదారిపై **ఏప్రిల్ 14న** తమ ఫ్యాక్టరీ మూసివేతను నిరసిస్తూ, చెల్లింపు బకాయిలను డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. తమ ఫ్యాక్టరీ యంత్రసామాగ్రిని తరలించటాన్ని వారు నిరసించారు.

బంగ్లాదేశ్ రెడీమేడ్ దుస్తుల ఎగుమతులపై ఇటీవల ప్రత్యేకించి ట్రంపు విధించిన 37 శాతం సుంకాల కారణంగా, బంగ్లాదేశ్ రెడిమేడ్ వస్త్ర పరిశ్రమ ఘోరంగా దెబ్బతిననుంది.

### ఆస్ట్రేలియా: వేతనాల పెంపు కోసం ఎలక్ట్రికల్ కార్మికుల సమ్మె

బ్రిస్బేన్‌లోని జపాన్‌కు చెందిన క్యాజిల్‌మైన్ పెర్కిన్స్ అనే మద్యం తయారీ కంపెనీకి చెందిన దాదాపు 20 ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ కార్మికులు **ఏప్రిల్ 17న** సమ్మె చేపట్టారు. గత సంవత్సరం డిసెంబర్ నుండి మూడు సం॥ల కాలానికిగాను వేతనాలను 15శాతం పెంపు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో 80 యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కార్మికులు ఏప్రిల్ 1న చేపట్టిన 24 గంటల సమ్మెకు కొనసాగింపుగా ఈ ఆందోళన చేపట్టారు. నూతన ఒప్పందంలో యాజమాన్యం సహాయకులను నియమిస్తున్నా లాండ్రీ ఎలవెన్స్, క్రిస్మస్ బోనస్ మొదలగు ప్రస్తుతమున్న సదుపాయాలను, హక్కులను వారికి కల్పించటానికి నిరాకరిస్తోంది.

**న్యూజిలాండ్: వేలాది మంది ప్రభుత్వ వైద్యుల సమ్మె పిలుపు**

న్యూజిలాండ్ ప్రజా ఆరోగ్య వ్యవస్థకు చెందిన 5,500 మంది సీనియర్ వైద్యులు, వేతనాలు పెంపు చేయాలని, సిబ్బంది కొరత పరిష్కరించాలనే డిమాండ్స్‌తో మే నెలలో సమ్మె చేయనున్నారు. అసోసియేషన్ ఆఫ్ సాలరీడ్ మెడికల్ స్పెషలిస్ట్స్ **ఏప్రిల్ 15న** నిర్వహించిన ఓటింగ్‌లో 86 శాతం మంది మే 1న 24 గంటలు పాటు విధులు బహిష్కరించటానికి అనుకూలంగా ఓట్ చేశారు. 1989లో ఈ యూనియన్ ఏర్పడిన తర్వాత మొదటిసారిగా 24 గంటల సమ్మె జరుపుతున్నట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

**అమెరికా: ట్రంప్ విధానాలకు నిరసనగా లక్షలాదిమంది 'హ్యాండ్స్ ఆఫ్' ప్రదర్శనలు**

ట్రంపు పాలనను నిరసిస్తూ **ఏప్రిల్ 19న** అమెరికా దేశవ్యాపితంగా 700కు పైగా నగరాలలో 'హ్యాండ్స్ ఆఫ్' పేరుతో 1500కు పైగా జరిగిన ప్రదర్శనలలో 30 లక్షలమంది పాల్గొన్నారు.

సరిగ్గా అమెరికా విప్లవం జరిగిన 250 సం॥ల తర్వాత లక్షలాది మంది ప్రజానీకం ఆధునిక నిరంకుశులైన ట్రంప్, మస్క్‌లను వ్యతిరేకిస్తూ వీధుల్లోకి వచ్చారు.

గతంలో జరిగిన ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలకంటే ఈసారి ఇవి మరింత మిలిటెంట్‌గా జరిగాయి. పిక్‌నిక్‌లు నిర్వహించటం, లైబ్రరీలను సందర్శించటం వంటి రాజకీయేతర కార్యక్రమాలలో ప్రజానీకం పాల్గొనాలని విపక్ష డెమోక్రటిక్ పార్టీ నాయకత్వం పిలుపునివ్వటాన్ని ధిక్కరిస్తూ మరింత మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. గాజాలో జరుగుతున్న మానవ హననానికి రిపబ్లికన్లు, డెమోక్రాట్లు ఏకపక్ష మద్దతునివ్వటం పట్ల వారు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక హక్కులపై, కాందిశీకులపై ట్రంప్ ప్రభుత్వ ఫాశిస్టు దాడుల పట్ల ప్రదర్శనకారులు తమ తీవ్ర నిరసన తెలిపారు.

**బెల్జియం: పెన్షను 'సంస్కరణ'లకు రైల్వే కార్మికుల నిరసన**

**2024 మార్చి నెలలో** బెల్జియన్ రైల్వే కార్మికులు తమ ఫెడరల్ ప్రభుత్వ పెన్షన్ల సమస్యపై సాగించిన వారం రోజుల సమ్మె, దేశవ్యాపితంగా రైల్వేసేవలకు అంతరాయం కల్గించింది. ప్రస్తుతం అమలులోవున్న పెన్షన్ సౌకర్యాలనేకం తొలగించి, రిటైర్మెంట్ వయసును పెంచుతూ ప్రభుత్వం ముందుకు తెచ్చిన సవరణలతో కూడిన పెన్షను సంస్కరణలను వీరు వ్యతిరేకిస్తున్నారు.

**గ్రీస్ : వేలాదిమంది మునిసిపల్ కార్మికుల ప్రదర్శన**

ఏథెన్స్ నగరంలో **మార్చి21న** మున్సిపల్ శాఖలో దీర్ఘకాలంగా, సహాయకులుగా పనిచేస్తున్న వేలాదిమంది కార్మికులు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి ప్రదర్శన నిర్వహించి, సంబంధిత మంత్రి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గ్రీక్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సివిల్ సర్వెంట్స్ కాన్ఫెడరేషన్ సభ్యులు తమకు పర్మినెంట్ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

**ఇటలీ : వేతనాల పెంపు కోసం 'ఐకియా' కార్మికుల దేశవ్యాపిత సమ్మె**

వేలాదిమంది ఐకియా కార్మికులు ఇటలీ దేశవ్యాపితంగా **మార్చి 15న** 24గంటల దేశవ్యాపిత సమ్మె నిర్వహించారు. వేతన, పని పరిస్థితుల మెరుగుదలను వారు డిమాండ్ చేశారు. 40 ఐకియా స్టోర్స్, రెండు పంపిణీ కేంద్రాలలో, దాని కేంద్ర కార్యాలయంలో 7,500 మంది ఉద్యోగులు, కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వ శలవు దినాలలో తమకు కూడా శలవు కల్పించే అవకాశం కావాలని, జబ్బుపడినపుడు వేతనంతో కూడిన శలవు కావాలని, పాక్షిక కార్మికులను పూర్తి స్థాయి కార్మికులుగా నియమించాలని వారు డిమాండ్ చేశారు.

**జార్జియా : గనుల జాతీయీకరణ డిమాండ్‌తో కార్మికుల ఆందోళన**

జార్జియాలోని చియాతురా ప్రాంత వాసులు, వందలాది మాంగనీసు గని కార్మికులు దేశ రాజధాని టిబ్లిసిలో **మార్చి 24వ తేదీన** నిరసన ప్రదర్శన నిర్వహించారు. గనుల మూసివేతతో, స్థానిక ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగా దెబ్బతిన్నాయి. జార్జియన్ మాంగనీసు యజమానులు 2024 నవంబర్‌లో తాత్కాలికంగా 3,500 మంది కార్మికులను తొలగించారు. 2025 మార్చి7 నుండి పూర్తిగా తవ్వకాలను నిలిపివేశారు. గనుల పరిశ్రమలను మొత్తంగా జాతీయం చేయాలని, కార్మికులకు బకాయిలు చెల్లించాలని, పర్యావరణం దెబ్బతిన్నందుకుగానూ పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

**ఇంగ్లాండ్: పొదుపు చర్యలకు 'విశ్వవిద్యాలయ సిబ్బంది నిరసన**

యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ ఆంగ్లియా విద్యా సిబ్బంది **ఏప్రిల్ 16న** ఒక రోజు 'వాక్ అవుట్' చేశారు. యాజమాన్యం పనిచేసే సిబ్బందిని ఆరవ వంతుకు తగ్గించటాన్ని వారు నిరసించారు.

యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ ఆంగ్లియా (యుఇఎ) 2023లో కూడా మొత్తంగా 400 ఉద్యోగులను కుదించి 4 కోట్ల పౌండ్లను ఆదాచేశామని పేర్కొంది. తిరిగి ఈ సంవత్సరం 200 ఉద్యోగాలలో కోతపెట్టి, దాదాపు 1 కోటీ 10 లక్షల పౌండ్లను ఆదా చేస్తున్నట్లుగా ప్రకటించటాన్ని ఉద్యోగులు, సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు.

యూనివర్శిటీ అండ్ కాలేజీ యూనియన్ (యుసియు) సభ్యులు వేల్స్‌లోని కార్డిఫ్ యూనివర్శిటీలో సమ్మెకు మద్దతుగా 83శాతం ఓటు వేశారు. హల్లమ్ యూనివర్శిటీ సిబ్బంది, అధ్యాపకులు రెండు రోజులు పికెటింగ్ నిర్వహించారు.

**ఇరాన్ : సాగునీటికై రైతుల ఆందోళన**

తమ భూములకు జయంధేరుద్ నదీ జలాలను అందించాలని పర్షియన్ నూతన సంవత్సరం 'నౌరుజ్' నాడు రైతులు రాష్ట్ర జలవనరుల కార్యాలయం వద్ద ధర్నా చేశారు. దీని కొనసాగింపుగా **మార్చి 25** నాటికి సాగునీరు అందించాలని రైతులు ట్రాక్టర్లతో ప్రదర్శన నిర్వహించారు.

మర్నాడు కార్మికులు తమ వేతన బకాయిలు చెల్లించాలని, దిగజారుతున్న పనిపరిస్థితులను మెరుగు చేయాలని, పెరుగుతున్న జీవన వ్యయాన్ని అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేశారు. బేకాన్, ఎజ్, కెర్మాన్‌షా, ఇస్లామ్ షహర్, టెహరాన్ నగరాలలో కార్మికులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆర్థిక, సామాజిక పరిస్థితులు దిగజారుతుండగా ఇరాన్ వ్యాపితంగా సమ్మెలు, ఆందోళనలు నిరంతరాయంగా సాగుతున్నాయి.

**నైజీరియా: ఒప్పంద అమలుకై చమురుశుద్ధి కార్మికుల సమ్మె**

నైజీరియాలోని కదునా రాష్ట్రంలో చమురుశుద్ధి కర్మాగార కార్మికులు **మార్చి 23న** సమ్మె చేశారు. యూనియన్‌గా సంఘటితమయ్యే హక్కును, ఒప్పందాల అమలును వారు డిమాండ్ చేశారు. ఈ మాత్రానికే యాజమాన్యం 30 మంది ఉద్యోగులను విధుల నుండి తొలగించింది. వీరిలో ఎక్కువ మందికి ఉద్యోగ ఉత్తర్వులు లేకుండా క్యాజువల్ కార్మికులుగా, ఉద్యోగులుగా పనిచేస్తున్నారు.

**స్పెయిన్ : వేలాదిమంది పర్యాటకరంగ కార్మికుల సమ్మె**

స్పెయిన్‌కు చెందిన స్వయం ప్రతిపత్తిగల ద్వీపసమూహాలు క్యానరే ఐలాండ్స్. ఆఫ్రికా తీరంలోని ఈ దీవులు ప్రధానంగా పర్యాటకంపై ఆధారపడి వున్నాయి. క్యానరే ఐలండ్స్‌లోని 80 వేలమంది హోటల్, క్యాటరింగ్, ఆతిధ్య కార్మికులు **ఏప్రిల్ 17, 18 తేదీల్లో** రెండు రోజుల సమ్మె నిర్వహించారు. జీవన వ్యయం పెరుగుదలతో, తమ వేతనాల పెంపును వారు డిమాండ్ చేశారు. ప్రధాన పర్యాటక ప్రాంతాలైన కోస్టా ఆడేజా, ప్లాయా డిలాస్ మొదలైన చోట్ల 10 వేలమంది కార్మికులు ప్రదర్శన నిర్వహించారు.

**ఫిన్‌లాండ్ : వేతన పెంపుకై ప్రభుత్వరంగ కార్మికుల సమ్మె**

80 వేలమంది కార్మికులలో భాగమైన వందలాది ప్రభుత్వరంగ కార్మికులు ఫిన్లాండ్‌లో ఏప్రిల్ 22 నుండి ప్రారంభించి మూడురోజుల సమ్మె చేపట్టారు. 7.8 శాతం వేతన పెంపుదలను వీరు డిమాండ్ చేస్తుండగా, ప్రభుత్వం 6.3 శాతం మించి పెంచటానికి సిద్ధంగా లేదు. ఫిన్లాండులోని సంపదంతా ఉన్నతశ్రేణిలోని 10 శాతం సంపన్నులవద్దే కేంద్రీకరింపబడి వుంది. వీరిలోని 7గురు బిలియనీర్‌ల వద్ద దేశ నికర సంపదలో సగానికిపైగా పోగుపడి వుంది.

**స్కాట్‌ల్యాండ్ : నీటి సరఫరా కార్మికుల ఆందోళన**

1500 మంది స్కాటిష్ వర్కర్స్ **ఏప్రిల్ 21** అర్థరాత్రి నుండి 48 గంటలపాటు నీటి సరఫరా నిలిపివేసి ఆందోళన సాగించారు. స్కాట్‌ల్యాండ్ లోని 50 లక్షల మంది జనాభాకు 'స్కాటిష్ వాటర్' సంస్థ ద్వారానే శుద్ధమైన త్రాగునీరు సరఫరా అవుతుంది; అలాగే మురుగునీటి తరలింపు జరుగుతుంది. కార్మిక యూనియన్ 2024–25కు గాను 3.4 శాతం వేతన పెంపుదలను కోరుతుండగా, యాజమాన్యం 2.6 శాతం మాత్రమే ఇవ్వటానికి సిద్ధమైంది. ఆందోళన సాగుతోంది.

**ఇరాన్ : దేశవ్యాపితంగా కార్మిక, ప్రజా ఆందోళనలు**

సోషల్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వృత్తి విరమణ చేసిన ఉద్యోగులు **ఏప్రిల్ 20** ఆదివారం నాడు టెహరాన్‌తో సహా పలు నగరాలలో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. 'మా హక్కులను హుందాగా మాకు కల్పించండి' అని వారు నినదించారు.

అదేరోజున మెట్రో యాజమాన్యాల నిర్వహణా వైఫల్యాలను నిరసిస్తూ, తమ వేతన బకాయిలను డిమాండ్ చేస్తూ టెహ్రాన్ మెట్రో కార్మికులు మునిసిపల్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ఇరాన్‌లో జీవన పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. దాదాపు దేశంలోని సగభాగం పేదరికంలో ఉందని ఒక వార్తాపత్రిక కథనం. అమెరికా ఆంక్షలు, యుద్ధ హెచ్చరికల నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత దిగజారింది.

**బ్రెజిల్: విద్యాప్రైవేటీకరణను నిరసిస్తూ ఉపాధ్యాయుల ప్రదర్శన**

**ఏప్రిల్ 15న** 2 వేలమందికి పైగా ఉపాధ్యాయులు విద్యా ప్రైవేటీకరణను, పూర్తికాలపు ఉపాధ్యాయులను తాత్కాలిక ఉపాధ్యాయులుగా మార్చటాన్ని నిరసిస్తూ సావో పాలో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన జరగనీయకుండా కల్పించిన ఆటంకాలను వారు అధిగమించారు. ఏప్రిల్ 25న సావో పోలో విద్యా కార్యకర్తలు మొత్తంగా సమ్మె నిర్వహించాలని నిర్ణయించారు.

**అర్జెంటీనా: పెన్షనర్ల ఆందోళనపై పోలీసుల నిర్బంధం**

అర్జెంటీనా ప్రభుత్వం పెన్షన్ నిధులలో విధించిన కోతలను నిరసిస్తూ **ఏప్రిల్ 16న** నేషనల్ లెజిస్లేచర్ వద్ద ఆందోళన చేపట్టిన పెన్షనర్లపై ప్రభుత్వం నిర్బంధం చేపట్టింది. పెన్షనీర్లపై పోలీసులు లాఠీఛార్జ్ జరిపి, భాష్ప వాయువు ప్రయోగించారు. అనేకమంది ఆందోళనకారులను అరెస్టు చేశారు. చాలామంది ఈ దాడులలో గాయపడ్డారు. ప్రతి బుధవారం ఇక్కడే తమ నిరసన తెలపాలని వారు నిర్ణయించుకున్నారు. పెన్షన్‌లలో పెంపును, తమ ఔషధాల ఖర్చు పూర్తి చెల్లింపును వారు డిమాండ్ చేస్తున్నారు.

**మెక్సికో: ప్రజా రవాణా ఛార్జీలో పెంపుకు నిరసన - ప్రభుత్వ నిర్బంధం**

మెక్సికోలో అత్యధిక జనాభా ఉన్న నగరాలలో రెండవదీ, పారిశ్రామిక ప్రాంతమైన మాంటెర్రరీలో ప్రజా రవాణా ఛార్జీల పెంపును నిరసిస్తూ వందలాదిమంది కార్మికులు **ఏప్రిల్ 18న** నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిటీ హాల్ నుండి ప్రారంభమైన ప్రదర్శన అనంతరం దగ్గరలోని ఓ పార్కు వద్ద బైఠాయించి వారు నిరసన తెల్పబూనుకోవటాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ప్రదర్శనకారులందరిపై దారుణంగా విరుచుకపడి, దాడి చేయడంతో పాటు ఒకరిని బంధించి తీసుకెళ్లారు; అతని వివరాలను కూడా వెల్లడించలేదు. రవాణా వ్యవస్థ ఒకవైపు నానాటికీ దిగజారిపోతూ, మరోవైపు రవాణా ఛార్జీలు పెరిగిపోతుండడం పట్ల కార్మికులు తీవ్ర నిరసన తెలిపారు.

**అమెరికా : పని భారం పెంపును వ్యతిరేకిస్తూ కార్మికుల సమ్మె**

2024 సంవత్సరంలో 3400 కోట్ల డాలర్ల ఆదాయం ఆర్జించి, 70 వేల మంది కార్మికులు, ఉద్యోగులను కలిగి, 197 దేశాల్లో విస్తరించి వున్న 'కమ్మిన్స్' ప్రపంచ స్థాయి సైనిక వాహన తయారీ కంపెనీ కార్మికులు యునైటెడ్ ఆటో వర్కర్స్ (యుఏ డబ్ల్యు) ఆధ్వర్యంలో **మార్చి 18న** సమ్మె చేశారు. వారు ఇప్పటికే సంవత్సరానికి 18 శనివారాలు తప్పనిసరిగా పనిదినాలుగా పాటిస్తూ శ్రమిస్తున్నారు. కాగా, యాజమాన్యం ఈ సంఖ్యను ఇంకా పెంచాలనుకోవటంతో పాటు, తాత్కాలిక ప్రాతిపదికపై కార్మికులను పనిలోకి తీసుకోవటాన్ని కార్మికులు నిరసించారు.

**కెనడా : ఆరోగ్య రక్షణ కార్మికుల దీర్ఘకాలిక ఆందోళన**

బ్రిటిష్ కొలంబియా ఆరోగ్య రక్షణ కార్మికులు బిసిజిఈయు ఆధ్వర్యంలో విక్టోరియా పార్లమెంటుకు **ఏప్రిల్ రెండవ వారంలో** వందలాదిమంది ప్రదర్శన చేశారు. నర్సులతో సహా 1100 మంది ల్యాబ్ టెక్నీషియన్లు దీనికి మద్దతుగా ఉన్నారు. కాగా, సమ్మెలో పాల్గొన్న 129 టెస్టింగ్ ల్యాబులలో పనిచేసే వైద్య, సాంకేతిక నిపుణులు ఆసుపత్రి సిబ్బందితో సమమైన జీతం ఇవ్వాలని, మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. వీరు 11 వారాలుగా రిలే ఆందోళనలు చేస్తూ వస్తున్నారు.

**అమెరికా : వాణిజ్య యుద్ధాన్ని నిరసిస్తూ ఆందోళనలు**

55,000 మందికి పైగా లాస్ ఏంజెల్స్ ప్రాంత కార్మికులు **ఏప్రిల్ 28** సాయంత్రం పనుల నుండి వైదొలగనున్నారు. వీరిలో ఆరోగ్య పరిరక్షణ వృత్తి నిపుణులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా పనుల సిబ్బంది, గుమాస్తా సిబ్బంది పార్కు వుద్యోగులతో పాటుగా, అసంఖ్యాక కార్మికులు కూడా ఉన్నారు. కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం ఫలితంగా, మౌలిక సరుకుల, సేవల ధరలు పెరుగుతూ జీవన వ్యయం పెరిగిపోతోంది. దీనికి వ్యతిరేకంగా లాస్ ఏంజల్స్ ప్రాంత కార్మికులు ఈ ఆందోళన చేపట్టారు.

గతంలో వీరు చేపట్టిన అనేక ఉద్యమాల అనుభవాల వెలుగులో ఈ సమ్మెను మరింత 'వాస్తవిక' పోరాటంగా అసమానత్వం, నిరంకుశత్వం బెదిరింపులకు వ్యతిరేకంగా సాగే కార్మిక వర్గ పోరాటంలో భాగంగా మలచాలని వారు పేర్కొన్నారు.

**శ్రీలంక : అమెరికా ఆంక్షలతో కార్మికుల ఆందోళన**

శ్రీలంక దక్షిణ భాగంలోని రాష్ట్రమైన హిక్కాదువాలో 'హోగ్ టెక్స్' దుస్తుల తయారీ పరిశ్రమ కార్మికులు 2 వేలమంది **ఏప్రిల్ 8న** ఆగ్రహంతో కూడిన ప్రదర్శనలు చేశారు.

సింహళ దేశంలో సింహళ–తమిళ నూతన వేడుకల సందర్భంగా సాంవత్సరిక బోనస్ ప్రకటించకపోవటాన్ని వారు నిరసించారు. కాగా శ్రీలంక ఎగుమతులకు అమెరికా అతిపెద్ద కేంద్రంగా ఉంది. ఇప్పటికే 2022లో కార్మికులు చేసిన భారీ

సమ్మెలో పాల్గొన్న 5 లక్షల మంది, తమ ఉద్యోగాలను పోగొట్టుకున్నారు. ప్రస్తుతం అమెరికా విధించిన ఆంక్షలతో అధిక సంఖ్యలో కార్మికులు ఉపాధి కోల్పోనున్నారు.

**ఇండియా**

**కర్ణాటక : ఏప్రిల్ 14 నుండి టోల్ భారాలను నిరసిస్తూ ట్రక్కు డ్రైవర్లు, యజమానుల నిరవధిక సమ్మె**

పెరిగిన డీజిల్ ధరలను, టోల్ ఛార్జీల భారాలను నిరసిస్తూ ట్రక్ యజమానులు, డ్రైవర్లు **ఏప్రిల్ 14 నుండి సాగించిన నిరవధిక సమ్మె ఏప్రిల్ 17న** ముగిసింది. 6 లక్షల మంది ట్రక్ యజమానులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. 2024 జూన్ నుండి డీజిల్‌పై లీటర్‌కు ఐదు రూపాయలు పెంచటాన్ని, రాష్ట్ర ప్రభుత్వం అమ్మకం పన్నును 18.44 శాతం నుండి 21.17 శాతానికి పెంచటాన్ని వారంతా తీవ్రంగా వ్యతిరేకించి ఆందోళన చేశారు.

అలాగే, కర్ణాటక రాష్ట్రంలో 18 రాష్ట్ర టోల్ ప్లాజాల వద్ద టోల్ ఫీజులు చెల్లించాల్సి వస్తోందని, ఏ రాష్ట్రంలోనూ ఈ పరిస్థితి లేదని వారు పేర్కొన్నారు. డీజిల్ ధరల పెంపును టోల్ ప్లాజాల భారాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కర్ణాటక స్టేట్ లారీ ఓనర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది.

**మిజోరాం : ఉద్యోగాల పర్మినెంట్ కోసం ఆందోళన**

మిజోరాం రాష్ట్రంలో కేంద్ర ప్రాయోజిత పథకాల నిర్వహణకు గాను నియమించుకున్న దాదాపు పదివేల మంది తాత్కాలిక ప్రభుత్వ ఉద్యోగులు, తమకు పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ **ఏప్రిల్ 15న** తమ విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఆల్ మిజోరం సిఎస్ఎస్ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 'నో వర్క్ నోపే' అమలు చేసి, సమ్మె చేస్తున్న ఉద్యోగులను బెదిరింపులకు గురిచేయాలని చూసినా, లక్ష్య పెట్టకుండా ఆందోళన సాగించారు.

**కేరళ : 'ఆశా' వర్కర్ల నిరవధిక ఆందోళన**

కేరళ రాష్ట్రంలోని 26 వేల మంది ఆశా వర్కర్లు (అక్రిడెటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్స్) **2025 ఫిబ్రవరి 10**వ తేదీ నుండి తమ వృత్తిపరమైన డిమాండ్ల పరిష్కారానికి వివిధ రూపాల్లో నిరవధిక ఆందోళనలు సాగిస్తున్నారు. కేరళలో వీరికి గౌరవ వేతనంగా నెలకు 7000 రూ॥ మాత్రమే చెల్లిస్తున్నారు. దీన్ని 21 వేలకు పెంచాలని, గత మూడు నెలల బకాయిలను చెల్లించాలని, 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని, పదవీ విరమణ ప్రయోజనం ఐదు లక్షలు చెల్లించాలని వారు కోరుతున్నారు. ప్రసవానికి గర్భవతులు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే విధంగా వారిని ప్రోత్సహించడం, పిల్లలకు, గర్భవతులకు పోషకాహారం అందించటం, కుటుంబ నియంత్రణలను ప్రోత్సహించటం, ప్రధమ చికిత్సలు అందించడం మొదలగు కీలకమైన పలు కర్తవ్యాలను గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్నారు.

తిరువనంతపురం సచివాలయం బయట తమ నిరవధిక నిరసనను వారు వివిధ రూపాల్లో కొనసాగించడంలో భాగంగా ధర్నాలు, ప్రదర్శనలు, నిరాహార దీక్షలతో పాటుగా తమ తలవెంట్రుకలను పూర్తిగా తొలగించుకొని నిరసన తెలిపారు.

**తమిళనాడు : పవర్‌లూమ్ కార్మికుల, యజమానుల సమ్మె**

కోయంబత్తూరు, తిరుపూరులోని పవర్ లూమ్ కార్మికులు, పవర్ లూమ్ యజమానులు **మార్చి 19** నుండి సమ్మె చేస్తున్నారు. జౌళిమిల్లుల యాజమాన్యాల నుండి వారు వేతనాల పెంపును డిమాండ్ చేస్తున్నారు. మార్చి 11 నుండి నిరాహార దీక్షలను ప్రారంభించారు. వేలాది పవర్ లూమ్‌లపై శ్రమ చేసే 1,50,000 మంది కార్మికులు ఈ ప్రాంతంలో ఉన్నారు. కార్మికులు, చిన్న వ్యాపారులైన పవర్‌లూమ్ యజమానులు, పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలను పెంచాలని కోరుతున్నారు.

****